www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 1 డిసెంబర్ 2023
5
వైఎస్ఆర్



క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-చెన్నూరు

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీ బాల్, ఖోఖో, కబడ్డీకి సంబంధించి క్రీడా సామగ్రిని ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్ గురువారం ఎంపిడిఒ కార్యాలయం, సచివాలయాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది షెడ్యూల్డ్ అందరూ విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి 15 ఏళ్ల పైబడిన యువతి యువకులు క్రీడా పోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డి. సుబ్రమణ్యం ఎఒ బి. శకుంతల, జూనియర్ అసిస్టెంట్ ప్రతిభ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎంపిపి సురేష్ యాదవ్

మత సామరస్యానికి ప్రతీక పెద్దదర్గా

దర్గాలో సిఎం జగన్ ప్రత్యేక ప్రార్థనలు

ప్రభుత్వ లాంఛనాలతో పూలచాదర్ సమర్పణ



పూల చాదర్‌ను సమర్పిస్తున్న ముఖ్యమంత్రి



పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

మత సామరస్యానికి ప్రతీకగా, మహిమాన్విత సూఫీగా వెలు గొందుతున్న అమీన్‌పీర్ దర్గాను సంద ర్శించడంతో తన జన్మ చరితార్థమైందని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. గురు వారం కడప అమీన్‌పీర్ (పెద్దదర్గా) దర్గాను సందర్శించి, ప్రభుత్వ లాంఛనాలతో పూలచాదర్ సమర్పించారు. ముందుగా ఆయనకు దర్గా ప్రతినిధులు దర్గా సంప్రదాయ లాంఛనాలతో ఘనంగా స్వాగతం పలికారు. పీఠా ధిపతి ఆరీఫుల్లా హుస్సేని, దర్గా కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ముఖ్య మంత్రికి తలపాగా (పేటా) అలంకరణ చేసి, మెడలో షేలా, ఇలాటి ధరిం పజేశారు. అమీన్‌పీర్ దర్గా గ్రంథాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి దర్గా విశిష్టత, ప్రాశస్త్యాన్ని, చారిత్రక వైభవాన్ని పీఠాధిపతులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అమీన్‌పీర్ దర్గాను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆధారిస్తున్న జిల్లా ప్రజలు ఎంతో అదృష్టవంతులన్నారు. అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందివ్వగలుగుతున్నామన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణమంతా గట్టి పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూల సురేష్, ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జెసి గణేష్ కుమార్, నగర పాలక కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, దర్గా మేనేజర్ ఎస్ఎండీ అలీఖాన్, ముజావర్ అమీర్, దర్గా కో-ఆర్డినేటర్ కుతుబుద్దీన్, హజ్ హౌస్ ఛైర్మన్ గౌసుల్లాజం, నాయకులు అహమ్మద్ బాషా, షేక్ ఉమేర్, సయ్యద్ జైద్, డాక్టర్ సోహేల్, అఫ్జల్ ఖాన్, స్థానిక, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైలు మార్గాన్ని త్వరగా పూర్తి చేయాలి : పిసిసి

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కడప, రాయచోటి, మదనపల్లి, బెంగళూరు కొత్త రైలు మార్గాన్ని మంజూరు చేసిందని, కడప నుంచి పెండ్లిమర్రి వరకు రైలు మార్గం పూర్త యిందని పిసిసి రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులను ఇవ్వని కారణంగా పనులు నిలిచిపోయాయని, ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన నిధులు వెంటనే విడుదల చేసి రైలు మార్గాన్ని త్వరగాపూర్తిచేయాలని డిమాండ్ చేశారు. డిసిసి అధ్యక్షులు షేక్ అల్లాబకష్ ఆధ్వర్యంలో గురు వారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బంగళా సర్కిల్ వరకు పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు కత్వాల్ మహమ్మద్ రఫీక్, రాష్ట్ర కార్యదర్శి లీలా శ్రీనివాస్, జిల్లా అన్ని నియోజకవర్గాల కన్వీనర్లు రెడ్డి సాహెబ్, సోమశేఖర్ రెడ్డి, రైల్వేకోడూరు బాధ్యులు గోసాల దేవి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీఖాన్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్న కృష్ణ, జిల్లా మీడియా చైర్మెన్ నరేష్, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథతో కలిసి ర్యాలీ నిర్వ హించారు. అనంతరం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వాటాగా ఇవ్వవలసిన నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులు వెంటనే రైల్వే శాఖ ప్రాజెక్టు పనులు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. లేకుంటే రాయలసీమ ప్రజలు కోపాగ్నికి వైసిపి గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు దర్బార్ బాష, కోనేశేటి ప్రతాప్‌రెడ్డి, యహియాబాష, ఖాదర్ ఖాన్, మహ్మద్ రఫీ, డాక్టర్ అహ్మద్‌బాషా, రమేష్, రమణమ్మ, మహబూబ్ జాన్, మాజీ కౌన్సిలర్ మీనాకుమారి, రిజ్వానా పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

అరెస్టు అప్రజాస్వామికం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి -కడప అర్బన్

జగనన్న దర్గా దర్శనానికి వచ్చిన అరెస్టేనా అని ప్రశ్నించే గొంతుకలను ఉక్కు పాదం మోపడం అప్రజాస్వామికం అని నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు అన్నారు. ముఖ్యమంత్రి పెద్ద దర్గా సందర్శన సందర్భంగా తాలూకా పోలీసులు ఓబులేసును గురువారం ఉదయం అరెస్టు చేసి సాయంత్రం నాలుగు గంటలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి కడప జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పోలీసులు ఇంటి దగ్గరికి వచ్చి అరెస్ట్ చేశారని అన్నారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సందర్భంగా నిరుద్యోగ యువతకు ప్రతి ఏటా మెగా డీఎస్సీ, జాబ్ కాలెండర్, ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తాను అని నమ్మబలికి అధికారం లోకి వచ్చిన నాలుగున్నర సంవత్సారాలు పూర్తి అయిన ఒక్క నోటిఫికేషన్ విడుదల చేశారా అని ప్రశ్నించారు. నిరుద్యోగ సమస్యలపై నిరంతరమూ పోరాటాలు చేస్తామని, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని పేర్కొన్నారు.

నాయకులకు నోటీసులు.. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా ఉపాధ్యాయ, వివిధ పార్టీల నాయకులకు పోలీసులు నోటీసులు అందజేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్‌కు జమ్మలమడుగులో నోటీసులు అందించారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్ సుందరరెడ్డికి, మరికొందరికి ఇచ్చారు.



పోలీసుల అదుపులో డివైఎఫ్ఐ నాయకులు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డాక్టర్ హిదాయతుల్లా

క్రీడాకారులకు ప్రోత్సాహకం అభినందనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

క్రికెట్ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని డాక్టర్ హిదాయతుల్లా పేర్కొన్నారు. కెకెఆర్ ఖున్‌కా రిష్టా వ్యవస్థాప దినోత్సవం సందర్భంగా క్రికెట్ కప్ పోటీలు ఘనంగా నిర్వహించారు. గురువారం కడప సంధ్య సర్కిల్ డాన్ బాస్కో లియో క్రికెట్ గ్రౌండ్‌లో కెకెఆర్ ట్రోఫీ 2023 క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. పోటీలో విజేత జట్టుకు అందజేశారు ముఖ్య అతిథిగా డాక్టర్ హిదాయతుల్లా హాజరై మాట్లాడుతూ మ్యాచ్ నిర్వహించిన కడప నైట్ రైడర్స్ అధ్యక్షులు యం.తారిఖ్ అలీ, వారి మిత్ర బృందానికి అభినందించారు. అనంతరం యం.తారిఖ్ అలీ మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా తమ సంస్థ ద్వారా ఏంతో మంది యువ క్రీడాకారులకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. మ్యాచ్‌తో పాటు, రెండు రోజులుగా రక్తదాన శిబిరం రక్తదాతలకు బ్లడ్ వారియర్ అవార్డ్ అందించామని పేర్కొన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఇలాగే ముందుకు సాగాలని కోరారు.

సంక్రాంతి సంబరాలను జయప్రదం చేయాలి

- రెడ్డి సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి - కడప అర్బన్

రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సంక్రాంతి సంబరాలు-2024 జయప్రదం చేయాలని సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాగిరెడ్డి, లెక్కల కొండారెడ్డి, కోశాధికారి జి.ఆదినారాయణరెడ్డి కోరారు. గురువారం ప్రజాశక్తితో మాట్లాడుతూ తెలుగు వారికి అతి ముఖ్యమైన పండుగలలో సంక్రాంతి ఒకటని పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలు పేరుతో గ్రామీణ ప్రాంతాలలో మరుగున పడిపోతున్న మన సంస్కృతి, సంప్రదాయ ఆటలపోటీలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని వారు పాల్గొనవచ్చని తెలిపారు. కర్రసాము మహిళలు, పురుషులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు అందిస్తామని చెప్పారు. కబడ్డీ పోటీలు కేవలం పురుషులకు మాత్రమేనని చెప్పారు. 12 మందికి మంచి పాల్గొనకూడదన్నారు. ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15 అందజేస్తామని తెలిపారు. చెక్కభజన సంప్రదాయ పద్ధతిలో ఉండాలని పేర్కొన్నారు. ఒక బృందంలో 15 నుంచి 20 మంది పాల్గొనవచ్చని చెప్పారు. ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు ఉంటుందన్నారు. కోలాటం 12 నుంచి 16 మంది వరకు ఉండవచ్చని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు ఉంటుందని తెలిపారు. తాడులాగు పోటీలలో స్త్రీ, పురుషులకు విడివిడిగా పోటీలు ఉంటాయని చెప్పారు. పురుషులు, స్త్రీలకు ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు ఉంటుందన్నారు. ముగ్గుల పోటీల్లో చుక్కల ముగ్గులు వేయాలని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7,500, తృతీయ బహుమతి రూ.5వేలు ఉంటుందని చెప్పారు. ఎద్దుల బండలాగుడు పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా ఎవరైనా పాల్గొనవచ్చున్నారు. ప్రథమ బహుమతి రూ.1 లక్ష, ద్వితీయ బహుమతి రూ.75వేలు, తృతీయ బహుమతి రూ.50వేలు, 4వ బహుమతి రూ.30వేలు, 5వ బహుమతి రూ.20వేలు అందిస్తామని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఎడ్ల జతకు రూ.5వేలు ప్రోత్సాహక బహుమతి ఇస్తామని తెలిపారు. పోటీలలో పాల్గొనే సభ్యులు తమ దరఖాస్తులు ఈ నెల 5లోపు పూర్తి వారివారి పరిధిలోని పంచాయతీ కార్యదర్శిచే ధృవీకరించి స్వయంగా, పోస్టు ద్వారా రెడ్డి సేవా సమితి, 1/80-14, రాజీవ్ మార్గ్, యర్రముక్కపల్లె, కడప చిరునామాకు పంపాలని పేర్కొన్నారు. వివరాలకు 9989465956 నంబరు సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి

323 పరుగులకు సౌత్ జోన్ జట్టు ఆలౌట్

ప్రజాశక్తి - కడప

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్ - 23 మెన్ మల్టీ డే ఇంటర్నల్ క్రికెట్ టోర్నీలో సౌత్ జోన్ జటు మొదటి ఇన్నింగ్స్‌లో 84.1 ఓవర్లలో 323 పరుగులకు ఆలౌట్ అయింది. 9 వికెట్లను నష్టానికి 358 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 90.0 ఓవర్లలో 362 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన సౌజన్య జట్టు ఆట ముగిసే సమయానికి 84.1 ఓవర్లలో 323 పరుగులకు ఆల్ అవుట్ అయింది. వై. తేజ రెడ్డి 150 పరుగులు (సెంచరీ), ధరణి కుమార్ నాయుడు 102 పరుగులు (సెంచరీ) చేశారు. రెస్ట్ ఆఫ్ జోన్ జట్టులోని చెన్నారెడ్డి 2, ఆశిష్ రెడ్డి 2వికెట్లు తీసుకున్నారు. **639 పరుగులకు నార్త్ జోన్ జట్టు డిక్లేర్..** కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్ లో మూడు వికెట్ల నష్టానికి 379 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు ఆట ప్రారంభించిన నార్తోని జట్టు 135.1 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 639 పరుగుల వద్ద డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని రవికిరణ్ 121 పరుగులు (సెంచరీ), దుర్గా కుమార్ 100 పరుగులు (సెంచరీ) చేశారు. సెంట్రల్ లోని నవీన్ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ జట్టు ఆట ముగిసిన సమయానికి 42.0 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసింది. ఆ జెట్టులోని దుర్గా బాలాజీ 48 (నాట్ అవుట్) పరుగులు చేశాడు. నార్త్ జోన్ జట్టులోని శ్రీకర్ సాయి రెడ్డి 2, వాసు 2 వికెట్లు తీసుకున్నారు.



సెంచరీ చేసిన ధరణి కుమార్ నాయుడు, తేజ రెడ్డి

15 నుంచి వైవీయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల బిఎ, బికాం, బిఎస్‌సి, బిబిఎ, 1,3,5 సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్నాయని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల తేదీ వారిగా టైం టేబుల్ సంబంధిత కళాశాలలకు పంపామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను పరీక్షల ప్రారంభానికి ముందు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్ నుంచి అందుకోవాలని తెలిపారు. హాల్ టికెట్లు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులకు పరీక్షల హాల్లోకి అనుమతించేది లేదని పేర్కొన్నారు.

3న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని మస్తాన్ వల్లి వీధిలోగల ఫాలో చెస్ టోర్నమెంట్‌లో ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ డిసెంబర్ 3న నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10 స్థానాలు సాధించిన వారికి ట్రోఫీలు, బెస్ట్ ఉమెన్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌కు ట్రోఫీ, బెస్ట్ వెటర్న్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌కు ట్రోఫీ, వివిధ ఏజ్ కేటగిరి వారికి మెడల్స్ అందజేయనున్నట్లు తెలిపారు. టోర్నమెంటులో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు ఇస్తామని తెలిపారు.

విద్యార్థులకు డెంటల్ కిట్లు అందజేత

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రయాన్స్ హాస్పిటల్‌లోని డెంటల్ విభాగం వారు రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి ఆదేశాలు మేరకు పంచాయతీలోని ఎస్‌టి బాలుర గురుకుల పాఠశాలలో వందమంది పిల్లలందరికీ డెంటల్ కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి చిత్తాగిరి ప్రణీత్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండడానికి, నోటి నుంచి దుర్వాసన రాకుండా ఉండడానికి పళ్ళు రోజుకు రెండుసార్లు శుభ్రపరుచుకోవడం చాలా ముఖ్యమైన ప్రక్రియ అని పిల్లలందరికీ తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బాష, ప్రధానోపాధ్యాయులు టీచర్లు పిల్లలు పాల్గొన్నారు.



డెంటల్ కిట్ అందజేస్తున్న చిత్తగిరి ప్రణీత్‌రెడ్డి



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న వై.ఎస్. భారతి

రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు కాకర్ల కౌశిక్

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన కాకర్ల కౌశిక్ రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెసుకు ఎంపికైనట్లు జిల్లా వికలాంగుల సేవా సమితి నాయకుడు వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండలంలో విలేకరుల ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణపల్లికి చెందిన కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి నిర్మలాదేవి కుమారుడు, కాకర్ల కౌశిక్ ఎంపిక కావడం పట్ల వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సతీమణి భారతి అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

కడప అర్బన్ : ఎయిడ్స్ యువతకు అవగాహన అవసరమని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూర్యారావు, విశ్రాంత ఎంఇఒ నాగముని రెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినం సందర్భంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఎయిడ్స్ పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1981లో ప్యారిస్‌లో మొదటగా గుర్తించిన ఈ వ్యాధి అనతి కాలంలోనే ప్రపంచ మంతట వ్యాపించిన భయంకరమైన వ్యాది అన్నారు. అవగాహన పెరగడం, వ్యాధినివారణ జాగ్రత్తలు పాటించడం వల్ల వ్యాది తీవ్రత తగ్గిందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ ఆర్ సంస్థ అధ్యక్షులు రాయల్ కరీముల్లా పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

కడప అర్బన్ : పటేల్ రోడ్డులోని ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్ ఈనెల 2 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ ఆర్ రంగనాథరెడ్డి, డాక్టర్ కల్పన ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు , ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. ఉదయం 6.00 గంటల నుంచి 7.15 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848861206, 7013238986లలో సంప్రదించాలని తెలిపారు.

బధిర విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

కడప అర్బన్ : హెలన్ కెల్లర్స్ బధిరుల ఉన్నత పాఠశాల, పున రావాస కేంద్రంలో బధిర విద్యార్థులకు 'ఆరోగ్యం-పరిసరాల పరిశుభ్రత' అనే అంశంపై గురువారం జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఒకటవ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న బధిర విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. పోటీలలో ప్రాథమిక పాఠశాల స్థాయిలో మొదటి స్థానం ఎం. మోహిత్, ద్వితీయ స్థానం ఎస్.రెహాన్, ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో కె.ధరణి, లహరి, ఉన్న పాఠశాలస్థాయిలో జి.షరీఫ్, ఎం.స్వప్నిక, జూనియర్ కళాశాల స్థాయిలో బి.గోపి చంద్, బి.దుర్గాబాయ్, డిగ్రీ స్థాయిలో బి.నవీన్‌కుమార్, నిస్సార్ నిలిచారు. ఈ నెల 3న నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేస్తామని కరస్పాండెంట్ డాక్టర్ పి.దౌలత్‌ఖాన్, తెలిపారు.

ప్రజల వద్దకే పాలన : జడ్‌పిటిసి

కలసపాడు : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జడ్‌పిటిసి అంకనగురివిరెడ్డి మాట్లాడుతూ గురువారం మండలంలోని లింగారెడ్డిపల్లె సచివాలయ పరిధిలో ఎంపిడిఒ మహబూబ్‌బీ సారథ్యంలో ఎపికి జగనన్న ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాడుతూ జగనన్న పథకాలు లబ్దిదారులకు ఎంతో మేలు జరిగాయని చెప్పారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు సగిలి సుదర్శన్, సర్పంచ్ పుల్లెం గురమ్మ, పంచాయతీ సెక్రెటరీ రేణుక, ఎంపిపి బోధనబోయిన నారాయణ, సింగల్ విండో అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి. శంఖవరం సర్పంచ్, శారదమ్మ లింగారెడ్డి పల్లె సర్పంచ్, పుల్లెం గురమ్మ, నారాయణ, ఎంపిటిసి సగిలి రమేష్, మాజీ సర్పంచ్ రంగారెడ్డి, పెద్ద ఓబుల్ రెడ్డి, వెంకటయ్య, గృహ సారథులు, బూత్ కన్వీనర్లు, వాలంటీర్లు, వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు చారిత్రాత్మక అవసరం

కడప : తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు చారిత్రాత్మక అవసరం అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి జకరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ. సత్తార్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు చారిత్రాత్మక అవసరమని చెప్పారు. తెలంగాణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యం అన్నారు. ఎన్ని అవరోధాలు ఏర్పడిన ప్రజల మనోభావాలకు అనుగుణంగా సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీకి నష్టం వాటిల్లుతుందని తెలిసినా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని తెలిపారు. మతోన్మాద ఎంఐఎం, బిజెపిలతో బి ఆర్ఎస్ పార్టీ అధికారం కైవసం చేసుకోవడానికి చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. కార్మిక కర్షకుల జీవన విధానం మెరుగుపరచడంతో పాటు విద్యార్థి యువజనుల ఉపాధి మెరుగు పరుస్తుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పెంచల్ రెడ్డి పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్‌ను తొలగించాలి

ప్రజాశక్తి-కలసపాడు

ప్రమాదాలకు నిలయమైన పెండ్లిమర్రి కస్తూరిబా గాంధీ పాఠశాల వద్ద ఉన్న అనాధికారికంగా వేసిన స్పీడ్ బ్రేకర్‌ను తొలగించాలని నియోజకవర్గ టిడిపి నాయకులు రోషన్న పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్పీడ్ బ్రేకర్ ఎత్తుగా ఏర్పాటు చేయడం వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇటీవల సింగరాయపల్లెకు చెందిన దుగ్గినేని మరియమ్మ బైకులో వస్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద కంట్రోల్ చేయలేక అదుపు తప్పి కిందపడిందని, తరువాత రక్తం గడ్డకట్టి ఆమె చరిపోయిందని తెలిపారు. ఇలా చాలా ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, వెంటనే స్పీడ్ బ్రేకర్‌ను తొలగించి ప్రమాదాలను నివారించాలని కోరారు.

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-చెన్నూరు

రబీ- 2023 ఏడాదికి గాను రైతులందరూ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట వేసిన రైతులు అందరూ తమ గ్రామ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ని పట్టాదారు పాసుబుక్ లేదా సిసిఆర్‌సి కార్డు, ఆధార్ కార్డుతో సంప్రదించాలని తెలిపారు. బీమా, సున్నా వడ్డీ రుణాలు, పరిహారం పొందడానికి తప్పని సరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు.

క్రైస్తవులను మోసం చేసిన సిఎం

కడప అర్బన్ : క్రైస్తవుల ఓట్లతో గెలిచిన ముఖ్యమంత్రి జగన్ వారిని మోసం చేశారని టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్య క్షుడు ఈటె స్వామి దాసు పేర్కొన్నారు. కడప అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు క్రైస్తవులకు అనేక సంక్షేమ పథకాలు ఇచ్చారని, జగన్మోహన్ రెడ్డి ముఖ్య మంత్రి అయిన తర్వాత ఆ సంక్షేమ పథకాలను తుంగలో తొక్కేశారని విమర్శించారు. గతంలో క్రైస్తవులు పెళ్లిళ్లు చేసు కుంటే రూ. 50వేలు ఇచ్చే వారన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడి 5 సంవత్సరాలు కావస్తున్న ఒక్క క్రైస్తవునికి కూడా పెళ్ళికానుక ఇవ్వలేదనన్నారు. క్రైస్తవులు పెళ్లిళ్ల చేసుకుంటే రూ. లక్ష ఇస్తానని నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో క్రైస్తవులు బుద్ధి చెబుతారన్నారు. సమా వేశంలో క్రిస్టియన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ చదిపి రాళ్ల రమేష్ రెడ్డి, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పిఎండి వరప్రసాద్, కుమార్ రెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.


టిడిపిలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

టిడిపిలో చేరిన ఆర్యవైశ్య ప్రముఖులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో నారాయణ సత్యనారాయణ మరి కొంతమంది ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక సార్వకట్ట వీధిలో నివాసం ఉంటున్న సత్యనారాయణ ఇంటికెళ్లి వారిని, వారి అనుచరులు కోటా నరసింహ, ఓబులేసు, గుండా చంద్రశేఖర్, నటకాల సతీష్, జూటూరు జగన్ తదితరులకు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ ఎంపిపి గురివిరెడ్డి, టిడిపి పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

టిడిపితోనే 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

టిడిపితోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని ఆ పార్టీ ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు ఆదేశాల మేరకు పటాన్ కాలేజీ వద్ద జంగంపేట వీధిలో గురువారం ఆయన ఇంటింటికి తిరిగి ప్రజల కష్టాలను తెలుసుకుంటూ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంబనకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మహానాడులో ప్రకటించిన మేనిఫెస్టో చేయూత నిస్తుందన్నారు. రాష్ట్రంలో యువతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన అన్యాయాలపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో ఇట్టే చౌడమ్మ, ఇట్టే సునీల్‌కుమార్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి విజయభాస్కర్‌రెడ్డి, రాజుపాలెం మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, వెలవలి పద్మనాభరెడ్డి, పొట్టిపాటి గంగాధర్, కృష్ణారెడ్డి, మోతుర్కు వెంకటసుబ్బయ్య, నరసింహులు, మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బరాయుడు, అంపావతిన సుబ్బరాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సుంకర వేణుగోపాల్, మెరువా మూర్తి, పెన్నానగర్ మజీద్, 34 వార్డ్ రాఘవ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఎసి, చైర్మన్

హుండీ ఆదాయం రూ.18 లక్షలు

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో భక్తులు హుండీలో వేసిన కానుకుల ద్వారా హుండీల లెక్కింపులో 71 రోజులకు గానూ రూ.18,64,414 నగదు, 02 గ్రాములు బంగారం, ఒక కిలో 600 గ్రాములు వెండి వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్, ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ సాయిఅన్వేష్, ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజాస్వామి, కార్యాలయ సిబ్బంది, కళ్యాణ కట్ట క్షురకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రేషన్ : తహశీల్దార్

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ఇంటి వద్దకు ఎండియు వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. రేషన్ పంపిణీ చేసే సమయంలో వాలంటీర్లు ఆయా ప్రాంతాల్లో ఉండి ఎండియు వాహనం ద్వారా ప్రతి ఇంటికి రేషన్ బియ్యం ఇప్పిస్తారన్నారు. కేటాయించిన స్థలంలో వాలంటీర్లు ఎండియు వాహనాలు పెట్టి రేషన్‌కు సంబంధించి నిత్యావసర సరుకులను తూకం వేసి ఇస్తారని చెప్పారు. ఆ మేరకు వాలంటీర్లు, ఎండియు ఆపరేటర్లు పనిచేయాలని ఆయన సూచించారు.

బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని తవ్వారిపల్లెకు చెందిన ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య బ్యాంకు ఖాతా నుంచి దాదాపు రూ.58 వేలు మాయమైనట్లు గురువారం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేశారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని పోలీసులు సూచించారు.

నేడు ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శుక్రవారం ఎయిడ్స్ డే ర్యాలీని విజయవంతం చేయాలని ఎయిడ్స్ నియంత్రణ మండలి పులి వెందుల విభాగం కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, సుఖ వ్యాధుల కౌన్సిలర్ బాదల్ వలి, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు సంయుక్తంగా తెలిపారు. ఆ మేరకు గురువారం ఎయిడ్స్ గురించి కరపత్రాలను విడు దల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం దశాబ్దాల తరబడి అటు ప్రభుత్వం, ఇటు స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పులివెందుల శ్రీనివాస థియేటర్ సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి ప్రసాద్ ఆధ్వ ర్యంలో గురువారం 20 మంది విద్యార్థులు ప్రాంతీయ ఆసుపత్రిలోని రక్తనిదిలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సెల్వరాజు రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్ర మంలో రక్తనిధి సిబ్బంది అన్నమ్మల్, కుమార్ పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి - జమ్మలమడుగు


లబ్ధిదారులకు పరికరాలను పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

విభిన్నప్రతిభావంతులకు వైసిపి ప్రభుత్వం అండగా ఉందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పిఆర్ హైస్కూల్ ప్రాంగణంలో గురువారం డిజబుల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సహకారంతో ఎంపీ జమ్మలమడుగు నియోజకవర్గంలోని 1143 మంది విభిన్న ప్రతిభావంతులకు పలు పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని తొమ్మిదివేల మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.5 కోట్ల 85 లక్షల విలువగల పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో జన్మభూమి కమిటలు సిఫారసు చేసిన వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులకు మూడుపులు ఇస్తేగానీ సంక్షేమ పథకాలు పొందలేని పరిస్థితి అన్నారు. కానీ నేడు వైసిపి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి గతంలో వీరిపట్ల చిత్తశుద్ధితో పని చేయకపోవడంతో విభిన్నప్రతిభావంతులు ఇబ్బందులకు పడ్డారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవి నాష్‌రెడ్డికి వీరి సంక్షేమానికి తోడ్పడాలనే చిత్తశుద్ధితో ఇలాంటి కార్యక్రమాలు చేస్తు న్నారని అన్నారు. ఎంపీ మాట్లాడుతూ ఈనెలలోనే మరోసారి త్రీ వీలర్స్ స్కూటీలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, హజ్ కమిటీ చైర్మన్ బి.గౌస్ లాజం, హస్త కళల కార్పొరేషన్ చైర్మన్ బడిగింజల విజయలక్ష్మి, పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, ఆర్‌డిఒ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ జి.వెం కట్రామిరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు వల్లంబాయి హృషికేశవరెడ్డి, డైరెక్టర్ మార్బుల్ శీను, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, అధి కారులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు గురజాడ : పిసిసి


గురజాడ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కొనియాడారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం గురజాడ అప్పారావు పంతులు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్ర పటానికి తులసిరెడ్డి పూలమాలలు వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్, సుబ్బరాయుడు, శివ, నరసింహరెడ్డి పాల్గొన్నారు. **కడప :** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ అధ్యక్షతన గురజాడ అప్పారావు 108వ వర్ధం తిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షులు కోటపాటి లక్ష్మయ్య, బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోవూరు శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్ రాజంపేట అసెంబ్లీ ప్రెసిడెంట్ అఖిల్, జిల్లా మహిళ నాయకురాలు లు పి నాగరాణి, గౌరీ, నాయకులు సూర్యుడు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

నాగపూర్‌కు చెందిన బ్లూ డేనియా సి సర్వీసెస్ ఈసిఈ, ఈఈఈ, మెకానిక్, సివిల్ బ్రాంచ్‌ల్లో బాయ్స్‌కు ఎలక్ట్రో టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు నిర్వహించిన క్యాంపస్ ఆన్‌లైన్ రిక్రూట్మెంట్లో ఎస్ఆర్ఐటి విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపల్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలోని ఈసిఈ బ్రాంచ్‌కు సంబంధించిన విద్యార్థులు సి.చంద్రకిరణ్‌రెడ్డి, జి.రమేష్, జి.జయభరత్‌రెడ్డి, టి.షణ్ముఖం, ఈఈఈ విభాగంలో సాయి సుధీర్‌రెడ్డి, ఎం.వెంకట శివ, ఎం.చంద్ర ప్రశాంత్, సయ్యద్ అన్వర్ ఎంపికయ్యారన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ వీరికి ఏడాదికి రూ 4.5 లక్షల నుండి రూ.5.2 లక్షల వరకు వేతనాలు ఉంటాయన్నారు. చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీలు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

సంక్షేమ పథకాలతో అర్హులకు లబ్ధి : వైసిపి


లక్ష్మీపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి, వైసిపి నాయకులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా రూ. 19.37 కోట్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. లక్ష్మీపేట గ్రామంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సచివాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిపితోపాటు మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మంచిని ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణ వేణి, సర్పంచ్ శ్రీవిద్య, జిల్లా రైతు సలహ మండలి సభ్యులు నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ చంద్రమోహన్‌రెడ్డి, గృహ సారథులు, వాలంటీర్లు, విఆర్ఓ శ్రీనువాసులరెడ్డి, సచివాలయ సిబ్బంది విజయరాజు, ప్రజలు పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధించిందని వైసిపి జిల్లా కార్యదర్శి బిఎన్ బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గురజాల సచివాలయంలో మా నమ్మకం నువ్వే జగనన్న, ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ముఖ్యమంత్రి ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం సర్పంచ్ రామశేఖర అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో మండల గృహసారథుల కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి పద్మనాభరెడ్డి, ఉప సర్పంచ్ ఆనందరెడ్డి, పార్టీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.


స్టూడియో ప్రారంభోత్సవంలో నిర్మాత, సభ్యులు

పులివెందులలో స్టూడియో ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సినిమాలపై ఆసక్తిగల యువతీయువకుల కోసం నూతనంగా పులివెందుల నారాయణ కాలేజీ సమీపంలో ఫిల్మ్ హోలిక్ స్టూడియోను గురువారం మావూరి సినిమా నిర్మాత మంజునాథ్‌రెడ్డి (బుల్ రెడ్డి) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ సీరియల్లో ఆసక్తిగల వారి కోసం ఈ స్టూడియోను ప్రారంభించామన్నారు. గతంలో డబ్బింగ్, ఎడిటింగ్ కోసం కర్నూల్, అనంతపురం, కడప వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ అవసరం లేదన్నారు. సినిమాలు, వెబ్ సిరీస్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బక్, సీరియల్స్‌పై ఆసక్తిగల యువతీయువకులు సినీ ప్రియుల కోసం మా ఊరి సినిమా ఆధ్వర్యంలో స్టూడియోను ప్రారంభించామన్నారు. ఆసక్తిగలవారు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మునివర్ధన్, ఇంద్ర, అవినాష్, హరి, రామ్, శివ, విజయ్, నరేంద్ర, మాచిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటికను ఏర్పాటు చేయండి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీలోని బొగుడుపల్లి గ్రామంలో శ్మశానవాటికను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. శ్మశానవాటిక లేక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. గతంలో ఉన్న శ్మశానం కొలతల్లో వేరే వారికి పోయిందన్నారు. దహనక్రియలు చేయాల్సి వస్తే బొగ్గుడుపల్లె నుండి పులివెందులకు ఐదు కిలోమీటర్లు తీసుకొచ్చి పులివెందుల శ్మశానంలో కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి తమ సమస్యను పరిష్కరించాలని బొగుడుపల్లి వాసులు కోరు తున్నారు.

జాతీయ అవార్డు గ్రహీత నాగలక్ష్మికి సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

విద్య అమృత్ మహోత్సవ్ 2022-23 విద్యాసంవత్సరానికి గానూ జాతీయస్థాయిలో అవార్డు పొందిన సుంకులవారిపల్లి పాఠశాల ఉపాధ్యాయులు నాగలక్ష్మీదేవిని ఎస్‌టియు మైదుకూరు మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ పద్మలత మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తే ఇలాంటి అరుదైన అవార్డులను పొందవచ్చునని తెలిపారు. నాగలక్ష్మీదేవిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 నరహరిశర్మ, ఎస్‌టియు రాష్ట్ర కమిటీ కన్వీనర్ పాలకొండయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశ్వర్‌రెడ్డి, రీజినల్ కన్వీనర్ సురేష్, మండల శాఖ అధ్యక్షులు రమణయ్య, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవ ప్రసాద్, శెట్టివారిపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అహల్యాబాయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట పాత్రలు పంపిణీ

ఎర్రగుంట్ల : ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట పాత్రలను పంపిణీ చేస్తున్నట్లు ఎంఇఒ శివప్రసాద్ తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ప్రారంభంలో మొదటిసారి వంట పాత్రలు ప్రభుత్వం అందించిందని, తర్వాత ఇదే తొలిసారి అని ఆయన అన్నారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా పాఠశాలలను వివిధ కేటగిరీలుగా విభజించి, వాటి ప్రకారం వంట పాత్రలు పంపిణీ చేశారని తెలిపారు. ప్రభుత్వం నుండి వచ్చిన వంట పాత్రలను మండలంలోని 51 పాఠశాలలకు గురువారం పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల టాయిలెట్స్ సంబంధించి క్లీనింగ్ కెమికల్స్ కూడా ప్రభుత్వం ద్వారా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


తూకాలను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ జయదేవ్

తూకాల్లో కచ్చితత్వం పాటించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తూకాల్లో కచ్చితత్వం పాటించాలని తూకాలు, కొలతలు ఇన్‌స్పెక్టర్ జయదేవ్ తెలిపారు. కూరగాయల మార్కెట్లోని అంగళ్లు, మాంసం దుకాణాలు, తోపుడు బండ్లలోని తూకాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జయదేవ్ మాట్లాడుతూ తూనికలు, కొలతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కిరాణా, పండ్ల దుకాణాల్లో తూకాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ప్రజలు మోసపోకుండా అప్రమత్తంగా ఉండి చెక్ చేసుకుంటూ కొనుగోలు చేయాలని కోరారు. తూకాల్లో మోసం జరిగిందని గుర్తిస్తే రుసుంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చేపలు పట్టేవారికి అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని గండికోట ప్రాజెక్టులో చేపలు పట్టేవారు తప్పనిసరిగా అనుమతి (లైసెన్స్) కలిగి ఉండాలని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. 1433వ పసలీకు అనగా ఈ ఏడాది 1 సెప్టెంబర్ 2023 నుండి 30 జూన్ 2024 వరకు లైసెన్సు ఉన్నవారు గండికోట ప్రాజెక్టులో చేపల వేట కొనసాగించుటకు అర్హులన్నారు. లైసెన్సు లేనివారు చేపలవేట కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గండి కోట ప్రాజెక్టులో చేపలు వేటకోసం గతంలో 229 మందికి లైసెన్సు ఇచ్చా మన్నారు. ప్రస్తుతం 167మంది మాత్రమే లైసెన్సు పొందివున్నారని వివ రించారు. మిగిలిన వారు లైసెన్సులు పునరుద్ధరించుకోవాలని ఆయన కోరారు. కొత్త లైసెన్సులు పొందేందుకు, పాత లైసెన్సుల పునరుద్ధరణకు మైల వరం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి 94415 76743, లేదా చౌటిపల్లె మత్స్య శాఖ సహాయకులు 970472 2595వారిని కానీ సంప్రదించాలని తెలిపారు.

రబీ పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటను వెంటనే ఇ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ రైతులకు సూచించారు. ప్రతి రైతు తన పొలంలో సాగు చేసిన పంటను గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులకు తెలిపి తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకోవడం వల్ల రైతులు పంట బీమా, పంట మద్దతు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా వంటి పథకాలకు అర్హులవుతారని తెలిపారు. రబీ సీజన్ ప్రారంభమై చాలా రోజులైందని, ఆన్‌లైన్ సమస్య కారణంగా పంట నమోదు చేపట్టలేదన్నారు. రైతులు వెంటనే సాగులో ఉన్న పంటలకు ఇ క్రాప్ చేయించుకోవాలని ఎఒ కోరారు.


అన్నదానం చేస్తున్న విద్యాశ్రీ, కుటుంబ సభ్యులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని కాశీనాయన వృద్ధాశ్రమంలో గురువారం అన్నదానం నిర్వహించారు. సిద్దారెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొండారెడ్డిగారి శ్రీరాములరెడ్డి, స్వాతి దంపతుల కుమార్తె విద్యాశ్రీ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వెంకటయ్య, అన్నదాతల కుటుంబ సభ్యులు కొండారెడ్డి, ఈశ్వరమ్మ, వీరారెడ్డి, లక్ష్మీరెడ్డి, రామసుబ్బమ్మ, విక్రమ్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా ఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి - దువ్వూరు



జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా మండలంలోని పుల్లారెడ్డిపేటకు చెందిన కానాల ఓబుల్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఇంతటి పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చూస్తానన్నారు.

క్లాప్ డ్రైవర్లకు జీతాలు చెల్లించాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పని చేస్తున్న క్లాప్ డ్రైవర్లకు ఆరు నెలల నుండి వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే వారికి బకాయిలు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, కార్యదర్శి విజయకుమార్ కోరారు. ఆ మేరకు గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ ఆటోలు వెళుతుంటాయని, ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.60 వసూలు చేస్తూంటారు. కాంట్రాక్టర్‌కు ఒక నెలకు ఆటోకు రూ.62 వేలు చెల్లిస్తున్నారన్నారు. అయినా ఆ కాంట్రాక్టరు క్లాప్ డ్రైవర్లకు 6 నెలల నుండి వేతనాలు ఇవ్వకుండా పిఎఫ్, ఇఎస్ఐ నమోదు చేయకుండా వారాంతపు సెలవులు ఇవ్వకుండా వారితో పని చేయించడం సమంజసం కాదన్నారు. విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళితే తనకు సంబంధం లేదని చెప్పడం తగదన్నారు.